# శరణార్థి

నగరాజు



ఆమె నవ్వింది. ఒకానొక వర్షాకాలపు సాయంకాలం సముద్రంమీంచి తరలి వచ్చే తరగలాంటి నవ్వు పెదిమలమీద జార్చి

"అయితే, శరణార్థులన్నమాట." అన్నది.

తాటాకుల నేసిన యిల్లు. ఇంటిమీద మాలతీ తీగె. ఇంటిమీద పందిరిపైన రాధామనోహరాలు. గుమ్మంవద్ద తలుపు నానుకొని మత్తుగా నవ్వుతూ ఆమె.

"మీ యిష్టం" అన్నాను నేను ఇంటిని చూస్తూ.

ఇల్లు చాలా అందంగా అనుతోంది. కంచెమీద పాకిన బీరతీగెలు సాయంకాలం ఎండని పూస్తున్నాయి. గుమ్మానికి కొద్దిగా ముందు రెంపు ఎర్రగన్నేరు మొక్కలు. విశాలమైన వాకిలిలో బోలెడన్ని పూలమొక్కలు. దారి పొడుగునా పచ్చ కనకాంబరాలు. ఏమి హరిత సముద్రపు కెరటం యీ ఆవరణ అనుకొన్నాను.

"ఆగిపోయారేమిటి. లోపలకి రండి."

మెల్లిగా లోపలకి నడిచాను. ఆమె రెండవగదిలో పడకకుర్చీ వాలుస్తున్నది. ముందుగదికి వెదురు కటకటాలు. లోపల వస్తువుల అమరిక చాలాపొందిగ్గా. రెండవ గది ఆమె పడకగది కాబోలు. ఆకు పచ్చని పూలదుప్పటిపరచిన మంచమూ, మంచంమీద ఏవో రెండు పుస్తకాలు.

నేను గది తలుపుదగ్గర నిలబడి చూసాను. వెల్లవేసిన మట్టిగోడలు, పైన మిద్దె. తీరైన ముగ్గులు కింద అలికిన నేలమీద. కవుల కల్పనలోనూ ఆదర్శమైన ఊహలోనూ వుండే రామణీయకత యిక్కడ స్పష్టంగా ప్రతిఫలిస్తోంది.

"రండి. కూర్చోండి" అని పిలిచి లోనికి వెళ్ళబోతూ ఆగి "టీ తీసుకోవటానికి ఏవన్నా అభ్యంతరమా" అని అడిగింది.

ఇప్పటికే ఎక్కువైన నాకు కొద్దిగా అభ్యంతర మనిపించింది. అయినా అలసటవల్లా, వర్షంలో తడిసినందువల్లా మరేమీ మాట్లాడలేదు. ఆమె ఫ్లాస్కులో నుండి కప్పులో పోసి టీ అందించింది. టీ త్రాగేక సిగరెట్ వెలిగించుకొంటూ అడిగేను.

"మీ కేమన్నా అభ్యంతరమా?"

"ఫర్వాలేదు, దానికేముంది."

"చాలా కృతజ్ఞతలండి. అలసిపోయినవాడికి రాజోద్యానవనం తలుపులు తెరిచి ఆహ్వానించినట్లున్నది. చలివేంద్రం లాగూ, సౌకర్యవంతమైన మజిలీలాగూ వున్నది".

"అదేమిటి అంత అతిశయోక్తి?" అడిగిందామె నవ్వుతూ.

"నేను విజయవాడలో ఓ డిపార్టుమెంట్ ఆఫీసర్ని. వైజాగ్ నుండి బస్‌లో వస్తుంటే బస్ చెడిపోయింది. ఈ పల్లెటూళ్ళో బస్ చెడిపోతే గత్యంతరమేమిటి చెప్పండి. ఊరికి కొద్ది అవతల ఆగిపోయిందిలెండి బస్సు. అందాకా కాస్త కాలక్షేపమని యిలా వూళ్ళోకి వద్దామనుకొంటే దానికి తోడు చినుకులు. దగ్గర్లో ఉండటమే కాకుండా, గొప్ప అందంగానూ వుండటంతో యిలా వచ్చాను గాని మీ యింటికి, యింత గొప్ప ఆహ్వానం వస్తుందనుకోలేదు."

"చాలా సంజాయిషీ యిచ్చారు కాని, మళ్ళీ అతిశయోక్తులే" అని కొద్దిగా స్పష్టమైన ఉత్సాహంతో నవ్వింది ఆమె.

ఆమె నవ్వులో ఏదో ఆత్మీయత. పరిశీలనగా చూసాను. నుదుటిపైనుండి వెనక్కి జలపాతంలా జుట్టు. పొడువైన కన్నుల్లో నిండుగా కనుపాపలు. బొట్టులేని శుభ్రమైన నుదురు. తీరైన ముక్కు. సంపన్నమయిన వక్షం, నిండైన వొళ్ళు.

చాప పరచుకొని కూర్చుంటూ "ఏమిటి ఆలోచిస్తున్నారు బస్ రిపేరు గురించా?" అన్నది పరిహాసంగా.

మడత కుర్చీలో వెనక్కి వాలి కూర్చొన్నవాణ్ణి ముందుకు వొంగి "ఇంత చేసారు కాని మీ గురించి చెప్పనేలేదు. మీ పేరేంటి?" అని అడిగి పరిశీలనగా ఆమెను మరోసారి చూసి నివ్వెరపోయాను.

జ్ఞాపకంనుండి ఉబికిన ఆశ్చర్యంతో క్షణకాలం కంపించిపోయి "సముద్రం! నువ్వా" అని అరిచాను.

ఆమె విస్మయంతో చూసింది. శుభ్రమైన వాకిలిలాంటి ఆ నుదురు క్రింద, కాటుక పెట్టిన కళ్ళల్లో సంధ్యాదీపాలు వెలిగినట్టు మెరుపు. ఆ వెనుక, పెదాల పై చిన్ననాటి సుచ్ఛ్ళ్ల స్మృతి తాలూకు చిరునవ్వు కాసేపటిదాకా ఏమీమాట్లాడక, నన్ను శ్రద్ధగా చూసి, ఆ తర్వాత,

"నువ్వా" అని నెమ్మదిగా అన్నది.

అని తనే అందుకొని, "చాలా చిత్రంగా కలిసావు. నిన్ను మళ్ళీ చూస్తాననుకోలేదు. నిన్ను తప్పకుండా కలవాల్సిన వొకటి రెండు ముఖ్యమైన సందర్భాల్లో కూడా కలవలేకపోయాను. ఈ వర్షాకాలపు సాయంకాలం అపరిచితుడిలా వచ్చి తలుపు తట్టావు," అని చాలా మామూలుగా అని, "అయితే ఆఫీసర్‌గా వుంటున్నావా విజయవాడలో? సెటిలయినావన్నమాట జీవితంలో" అని అన్నది.

సెటిలవడమంటే? సమస్యల్ని ఫేస్ చేయటానికా? చీకూచింతా లేకుండా కాలం వెళ్ళదీయటానికా? మరి దేనికి? ఓ భార్యా, పిల్లలూ, చక్కని ఉద్యోగం నాలుగంకెల జీతం, డాబాయిల్లు, స్టేటస్. వాటికితోడు బేంక్ బేలన్స్ - ఇవన్నీ నాకున్నాయి. ప్రమాదకరమయిన సమస్యలు కూడా లేవు. ఆ లెక్కన సెటిలయినట్టే. అయినా నాకు ఎందుకో తెలియని అశాంతి? నా తోటి ఆఫీసర్లు కూడా యిదే అశాంతిలో. ఏమిటిది?

"పెళ్ళయిందా" చిన్న వ్యంగ్యం ఉంది ఆమె ప్రశ్నలో?

"అయింది. పిల్లలు కూడా. మరి నీకు?"

ఆమె వివరాలు అడగనేలేదు. సముద్రం ఆలోచనకు చిక్కనిది మాటలకి అందనిదీను. ఆమె సముద్రం అని తెలియగానే ఏమిటీ వణుకు వెన్నులో? ఏమిటీ నొప్పి గుండెలో?

"నాదంతా పెద్దకథ. తర్వాత చెప్తాను. చాలాకాలం తర్వాత నన్ను చూసావు కదా. ఉండిపో. రేపు వెళుదువుగాని" అని ఆజ్ఞాపించింది.

నేనేమీ మాట్లాడలేదు. కనీసం సముద్రం ఇంత హాయిగా ఎలా వుండగల్గుతోందో తెలుసుకొనేదాకన్నా వుండిపోవాలనిపించింది.

"వేళ్ళేళ్ళున్నాయి. అలసటగా ఉన్నట్టుంది. స్నానం చెయ్యకూడదూ?"

ఇప్పుడవేమీ వొద్దు అనబోయి "కాసేపాగి చేస్తాను" అన్నాను.

"సరే, ఇవి చదువుతూ వుండు" అని మంచంమీది పుస్తకాలు నాకిచ్చి తాను లోనికి వెళ్ళిపోయింది. ఒకటి బుచ్చిబాబు కథలు నాలుగయిదు కూర్చిన సంపుటి. రెండోది 'శశాంక'. చలంగారి నాటిక. రెండూ చిన్నప్పుడు చదివినవే. ఆలోచన చిన్నప్పటి జీవితంవైపు మళ్ళింది.

చిన్నతనంలో చాలా చురుకైనవాణ్ణి నేను. అంత చురుకూ చదువులో

మాత్రమే. ఆటలాడాలన్నా, ఎవరితోనన్నా మాట్లాడాలన్నా కూడా చాలా భయం నాకు. అలాంటిదేమన్నా పోగొట్టి, నాకు కాస్త ధైర్యం ఇచ్చి బ్రతకటం నేర్పింది సముద్రమే.

విశాఖపట్నం దగ్గర ఓ పల్లెటూళ్ళో నేను పుట్టాను. మా నాన్న వ్యవసాయం చేస్తూండేవాడు. నేను బళ్ళో చేరేనాటికి నా వయసే ఉన్న సముద్రాన్ని తీసుకొని వచ్చారు మాష్టారు.

మాష్టారు మహానుభావుడు. మేధావి. ఆయనది భీమునిపట్నం. ఆయన భార్య సముద్రాన్ని కని చనిపోయింది. మాష్టారి చేతుల్లో పెట్టి. సముద్రం మాష్టారి ప్రాణం. బహుశా భీమిలిలో ఉండటంవల్ల ఆ పేరు పెట్టుకొన్నారేమో, నాకు తెలీదు.

నాకు యిరవయ్యేళ్ళు వచ్చేదాకా పద్నాలుగేళ్ళ పాటు మాష్టారూ సముద్రమూ మా ఊళ్ళోనే ఉండేవారు. నేను బియ్యే రెండో ఏడు చదువుతూండగా ఆయన చాలా గొడవలవల్ల ఆ ఊరొదిలి వెళ్ళిపోయారు.

నాలాంటి చాలామంది మగపిల్లల్లో కూడా కనిపించని చురుకూ, సాహసమూ, లోకజ్ఞానమూ సముద్రంలో కన్పించేవి. మాష్టారి జ్ఞానమూ, అనుభవమూ, సంస్కారమూ సముద్రంలో యినుమడించాయి.

సముద్రం ముందు నేను నీటిచెలమనే. అయినా నా మీద సముద్రానికి చాలా ప్రేమ. ప్రేమకన్నా వాత్సల్యమే.

సముద్రం పెద్దయ్యాక కూడా అంత చనువూ చూపించేది. నాకు సిగ్గుగా ఉండేది. ఆమె నాతో సరదాగా మాట్లాడుతుంటే ఎవరన్నా ఏమన్నా అనుకొంటారేమోనని తెగ భయపడేవాణ్ణి. ముఖ్యంగా మాష్టారు ఏమనుకొంటారో అని. చిన్నప్పుడు, మేం కలిసి పిచుకగూళ్ళు కట్టినపుడూ, దెబ్బలాడుకొని ఏడుస్తూ యింటికి వచ్చినప్పుడూ ఎలా చూసేరో అలాగే చూసేవారాయన. అంతకుమించి ఏమన్నా ఆలోచన వుండేదేమో నాకు తెలీదు.

సముద్రానికి నా మీద ఎటువంటి ప్రేమ ఉండేది? నేను హైస్కూల్లో చదువుతున్నపుడూ, సముద్రం నాతోపాటు చదవకుండా నా యింటర్ చదువు కొనసాగినపుడు కూడా రాని ఆలోచన డిగ్రీలో చేరాక వచ్చింది. సముద్రాన్ని పెళ్ళిచేసుకొంటే?

మాష్టారు ఏమంటారు? నాన్న సంగతేమిటి? సముద్రం అప్పుడూ యిలాగే ఉంటుందా? నాకు ఉద్యోగం వస్తుందా?- అమ్మో సముద్రాన్ని భరించడమే! అనిపించేది.

ఓసారి పెద్దయ్యాకే, నాకు కోపం వచ్చి 'నిన్ను పెళ్ళిచేసుకోను, పో' అని తిడితే సముద్రం గలగలా నవ్వింది. నవ్వి,

"ఇదెప్పటినించి? నేను నిన్ను పెళ్ళి చేసుకొంటానేమిటి? ఒకవేళ అయినా

నేను నీకు మొగుణ్ణి, నువ్వు నాకు పెళ్ళానివి" అని, అంతటితో ఊరుకోక "ఏమంటావ్ నాన్నా" అనడిగింది అంతా చెప్పి.

ఆయన ముసిముసి నవ్వులొలికించి "అతనికేం ఖర్మ, అదృష్టవంతుడు, కదయ్యా" అని ఓదార్చారు బేలమొహం పెట్టిన నన్ను.

ఇంకా ఆలోచిస్తున్న నన్ను సముద్రం ప్రస్తుతానికి తీసుకువచ్చి "పద, స్నానం చేద్దువుకాని, ఆలోచన యిప్పుడు కాదు" అని లాక్కెళ్ళి నీళ్ళు తోరిపి బాత్ రూమ్‌లో పెట్టి సబ్బూ, తువ్వాలూ యిచ్చింది.

స్నానాలగది తడికలతో కట్టారు. ప్రక్కన పొన్నపూలచెట్టు నిండుగా వెన్నెలని పూసింది. పెరటినిండా కూడా మొక్కలున్నట్టున్నాయి.

చాలా చీకటి పడింది. సాయంకాలం పట్టిన మబ్బు తెరలుగా విడి వెన్నెల సన్నగా ఆవరిస్తోంది. ఇదేం మాసం? ఏమో. ఇప్పుడూ సంవత్సరాలే లెక్క. ఫేనుగాలే శరణ్యం. కరెన్సీ నోట్లూ, కార్లూ, హడావిడి, అర్థంలేని పరుగు, తొందర.... సమస్తం యిదే అయిన నాకు ఈ సంజలో మళ్ళీన చల్లనిగాలి నా చిన్నప్పుడు మా వూళ్ళో విన్న పల్లె పదంలా ఉంది.

స్నానం చేసి బయటకు వచ్చాను. ఇందాక అనుకొన్నాను. ఇప్పుడు చూసాను. పెరడు చాల అందంగా ఉంది. చూరు వరసనా బంతిమొక్కలు. ఓ ప్రక్క అరటిమొక్కలు ఏపుగా, ఇంకా చాలా కూరగాయల మొక్కలు. మధ్యలో మాత్రం విశాలంగా కొంత ఖాళీస్థలం.

ఆమె తన చీరె మడతపెట్టి ఇచ్చింది. మనసులోనే ధన్యవాదాలు చెప్పుకొని లుంగీ కట్టుకొని వచ్చాను.

"భోజనం చేస్తావా? ఆకలిగాలేదూ? మధ్యాహ్నం ఎప్పుడో తినుంటావు ఏ హోటల్లోనో."

"కాసేపాగి తింటాను."

"సరే, నేనూ స్నానం చేస్తాను యీ లోపులో."

కడిగిన ముత్యంలా ఆమె స్నానం చేసి వచ్చింది. నేను ఆలోచనలో, స్మృతుల్లో యిరుక్కొన్నప్పుడు వంట చేసినట్టుంది.

అరిటాకులో భోజనం. వంటగది అరుగుమీద. ఆమె చేతి వంట, వడ్డన.

"నువ్వూ తినెయ్యరాదూ యిప్పుడే" అడిగాను.

"నువ్వు తిను చెప్తాను, ముందు."

దొండకాయకూర, గొంగూర పచ్చడి, చారు, అన్నీ పూర్తి అయాక "నువ్వేమి అనుకోపోతే, నీకు యిష్టమైన వాటిల్లో వొకటని తెలుసు, సేమ్యా పాయసం చేశాను, తింటావు కదా" అని అన్నది.

నాకు కడుపు నిండిపోయింది. ఇంకేమీ అనలేక "నేను రేపట్నించి మామూలుగా

బ్రతకలేనేమో విజయవాడలో" అన్నాను. ఆమె నవ్వి "ఈ మాత్రానికే," అన్నది.

నా భోజనం పూర్తయ్యాక అలానే కూచున్నాను. ఆమెకి వడ్డించుకోవటంలో సాయం చేద్దామని; చారు గరిటె తీస్తూ,

"అతిథిగృహస్తుకి మర్యాదచేయడు, మర్యాద పొందుతాడు, తెలుసునా" అని ఆ గరిటె లాక్కున్నది ఆమె.

ఎన్నో పుస్తకాల్లోనూ, కథల్లోనూ చదివాను యిలాంటివి ఉంటాయని. వాటి వాస్తవికతని పరీక్షించే అవకాశం నాకు ఎప్పుడో దాటిపోయిందనుకొన్నాను. కాని చూడబోతే యిప్పుడు నేనే పడ్డాను గారెలబుట్టలో.

ఆమె భోంచేసాక, వాకిట్లో నులక మంచం వాల్చింది. ప్రక్కనే మడత కుర్చీ వేసింది. ఆరుబయట సొంపైన వెన్నెల్లో, పూలతోటలో .... యిదేమిటి కవిత్వం మొదలవుతోంది నాకు.

"కవితలు వ్రాస్తున్నావా? చిన్నప్పుడు వ్రాసేవాడివికదా"– ఆమె మంచం మీద కూర్చొని అడిగింది కమలాఫలం కాటోలు వొలుస్తూ.

నా మనసుకే నవ్వొచ్చింది. కడుపారా కనీసం రోజుకోసారయినా నవ్వుకోలేనంత మెటీరియల్ నాగరికతలో ఓ స్టేటస్ కలిగిన పనిముట్టులాంటి నాకు కవితలు వ్రాసుకోగల్గినంత మహద్భాగ్యమా?

"లేదుకాని, నీ సంగతి చెప్పావు కావు" అనడిగాను, ఆమె కథలో నేను చూసిన ఆఖరి ప్రకరణాన్ని గుర్తుతెచ్చుకొంటూ. సముద్రం దగ్గర నేనెప్పుడూ చిన్నవాణ్ణే. అంతేకాదు బ్రతకటంలో. కూడా నేను అసమర్థుణ్ణి అనుకొనేవాణ్ణి. రానురాను ప్రేమ పెరగాల్సింది పోయి సముద్రం పట్ల నాకు భయమూ, అసూయా పెరిగాయి.

మాష్టారికి ఈ ఊహ ఉన్నట్లుంది. కాని ఆయన ఏరోజూ పైకి తేలలేదు. ఊరొదిలి వెళ్ళిపోతున్న సమయంలో మాత్రం "నువ్వు విజ్ఞానివి, అయినా చదువుకన్నా జీవితం ముఖ్యమైనది. దాని సంగతి కూడా ఆలోచించు" అన్నారు.

కానీ నేను ఆ రోజునించే కష్టపడటం వల్లే, చదువుమీదనే కాన్సంట్రేట్ చెయ్యడంవల్లే పైకి రాగలిగేను. నిజానికి నేనీ రోజు ఓ సంస్థకి ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ని, ఓ డిపార్టుమెంట్ ఆఫీసర్ని. తలచుకుంటే ఓ మేడ కొనగలను, ఓ కారు మెయింటయిన్ చేయగలను. కాని యింతకాలమయ్యాక, ఈ వృద్ధి మీద నాకే విరక్తి కలిగింది.

ఏదో అశాంతి నన్ను యింతకన్నా భౌతికంగా పెరగనివ్వలేదు. ఇప్పుడు ఈమాత్రం కూడా నాకు భరింపరానిదై పోతోంది.

"నా కథ చెప్పమని అడిగి, వినవేం" అన్నదామె తొనలు నా చేతికందిస్తూ.

"నువ్వు యింత ఆనందంగా ఎలా

ఉండగల్గుతున్నావ్ ?" చాలా ఆతృతతో అడిగేసాను.

ఆమె చాల గంభీరంగా మొహంపెట్టి "ఇంత అందమైన తోట పెరిగిన నేల కొన్నేళ్ళక్రితం స్మశానమంటే నమ్ముతావా ?" అనడిగింది.

"కావచ్చు. ఊరికి దూరంగా కూడా ఉందికదా" అన్నాను ఆలోచించి.

"ఈ విజం చెప్పావు కనుక నా కథ నీకు తెలిసినట్టే".

"అదేం ?"

"అదేమో తర్వాత చెప్తాను. నువ్వేమిటి అశాంతి అంటున్నావ్ ? ఏమిటి నీ సమస్య, ఎందుకు బాధపడుతున్నావ్ ?"

"బాధకేముంది. చదువుకొనే రోజుల్లో చదువే ముఖ్యమని చదివి పైకొచ్చాను. సంపాదించే రోజుల్లో డబ్బే ముఖ్యమని సంపాదించాను. కష్టపడి పనిచేసినట్టే పెళ్ళిచేసుకొని పిల్లల్ని కన్నాను. ఇంత కాలం గడిచిపోయాక నేను జీవితంలో ఏదో పోగొట్టుకొన్నానని తెలిసింది. కాలంకన్నా ముందుపోదామని చేసిన ప్రయత్నం అర్ధరహితలేని అనుభవాన్ని మిగిల్చింది. ఇప్పుడు ఈ పల్లెనీ, ఈ యింటినీ, ఈ సాయంకాలపు గాలినీ, ఈ స్నానాన్నీ చూసేక నేను చేసిన తప్పు నాకు తెలుస్తోంది."

ఆమె నా మాటల్ని చాల శ్రద్ధగా వింది. విన్నతర్వాత,

"భౌతికమైన అవసరాలు తీరేక మానసికమైన అవసరాలు కలగడం సహజం. కాని భౌతికమైన అవసరాలే తీరనప్పుడు నువ్వు నిజంగానే నా కథ వినాల్సిన అవసరంలో ఉన్నావు" అని, లోనికివెళ్ళి దిండుతెచ్చి నా తలక్రింద పెట్టింది. సాయంకాలం కోసినవి కాబోలు పన్నజాజిమొగ్గలు తెచ్చుకొని మాలకట్టడం మొదలుపెట్టింది.

"నువ్వు డిగ్రీ చదువుతున్నపుడు కాబోలు మేం వెళ్ళిపోయాం. నేను నిన్ను ప్రేమించాను. ఏరోజూ నీకీ సంగతి చెప్పలేదు. కాని ఇప్పుడు కథ కోసం చెప్తున్నాను. నేను నిన్ను ప్రేమించాను. మా నాన్నగారికి కూడా తెలుసు. కానీ ఆయనే అన్నారు. 'గాలి పీయడం తప్పుకాదు, కాని వికసించలేని మొగ్గవైపు పీయడం వ్యర్థం' అని. నిజమే." అని, ఆగింది.

"అవును, కెరటాలకు భయపడి సముద్రంలో స్నానంచేయలేక ఇసుకలో నత్తగుల్లలూ, శంఖాలూ మాత్రమే ఏరుకున్నాను ఓసారి చిన్నప్పుడు. యౌవ్వనంలోనూ అంతే చేసాను. ఇప్పుడూ అంతే.

"నీ మనసు చాలా మంచిది, కాని అది చాలా దుర్బలమైనది. మళ్ళీ నీ మేధ బలమైనది, కాని దానివల్ల నాకేం ఉపయోగం ? నువ్వు వ్రాసిన కవితలు వింటున్నప్పుడూ, ఇంటర్‌లో నువ్వు నాకు 'గీతాంజలి' యిచ్చినపుడూ చలం

గారి రచనలమీద చర్చ జరిపినపుడూ, ఎన్నో సాయంకాలాలు మా యింటి ముందు నోరులేని కళ్ళల్లో అమితమైన ప్రేమ వర్షించినపుడూ అనిపించేది నాకు ఏమైనా నిన్ను నా వాడ్ని చేసుకో వాలని."

మళ్ళీ కొనసాగించింది ఆమె.

"కానీ సహజంగానే కుదరలేదు. వ్యక్తంకాని కవిత్వమెంతో వ్యక్తంకాని ప్రేమా అంతే. తర్వాత మాకు కృష్ణా జిల్లా బదిలీ అయింది. మరి మూడేళ్ళకే నాకు పెళ్ళి జరిగింది. ఈసారి మాల కట్టడం ఆపి, నాకేసి చూసి,

"పెళ్ళికొడుకు మాకు దూరపు బంధువు. మా నాన్నగారు నా కోసం దాచిన డబ్బుతో పెళ్ళిచేసారు. సామాన్యమైన ఊహలతోనూ, బాధ్యతలతోనూ నేను గృహిణిని అయ్యాను. నీమీద ప్రేమ నా కుంకుంబరిణె అడుగున పడి పోయింది. నేనూ ఓ చిన్న ఉద్యోగం చేసే ఓ వ్యక్తికి భార్యనయ్యాను."

మునకవెన్నెల. తొమ్మిదిన్నర కావచ్చు నైం. చంద్రుడు కొద్దిగా పైకివచ్చాడు. ఇందాకట్నించీ స్వేచ్ఛగా ఊగుతూన్న అరిటాకు మరొక అరటాకు అడ్డుపడ్డంతో కదలటంలేదు. తిరిగి ఆమెకేసి చూసాను.

"కొంతకాలం బాగానే సాగింది సామాన్యంగానే. ఆ తర్వాతనే సమస్యలు మొదలయ్యాయి. అతను మంచివాడే. కాని స్నేహంలో వ్యసనాలకి అలవాటయి పోయాడు. బాగా తాగుడు. ఆయన గురించి విని మా నాన్నగారు చాలా బాధ పడ్డాడు. ఓ దారికి తీసుకువద్దామని అను కుంటూనే అకస్మాత్తుగా మరణించారు. నాకు ఉన్న పెద్దదిక్కు పోవటమేకాక, డబ్బుకూడా ఖర్చయిపోయింది. ఈయన వ్యభిచారం, జూదం-సమస్తం అలవాటు చేసికొన్నారు. ఒక్కొక్కర్తినీ నెలల తరబడి ఒంటరిగా, పస్తులతో రోజులతరబడి గడిపిన సందర్భాలున్నాయి. ఐనా నేను ఏనాడూ అతన్ని నిందించలేదు. కారణం అతని మనస్సు నాకు తెలుసు కనుక.

"ఒకోసారి తాగేవొచ్చి కొట్టేవాడు. మరోసారి జూదంలో తగలేసివచ్చి నా కాళ్ళదగ్గరపడి ఏడ్చేవాడు. నాకు అన్పిస్తూ ఉండేది. ఇతనెవరు? ఇప్పటి దాకా ఎవరెవరిమో తెలీదే. మరి ఇప్పుడిలా ఉండటమేమిటి? నన్ను కొట్టడానికైనా, నా కాళ్ళదగ్గర ఏడ్వటానికైనా ఎవరితను? ఏమిటి సంబంధం? ఇలా యీ దేశంలో లక్షలాదిమంది అభాగ్యులు భావిస్తున్నారని నాకు తెలుసు. ఎందరో ఇలాంటి అనుభవాలే పొందుతున్నారని నాకు తెలుసు."

మళ్ళీ మబ్బులు పేరుకొంటున్నాయి. నాకు చాలా ఉక్కగా ఉంది. వెన్నెల మరీ పలచబడిపోతోంది. కాని మనసు మాత్రం శ్రద్ధగా వింటోంది.

ఆమె చెప్తోంది.

"అయితే, అతన్నేదో మంచి

మార్గంలో పెట్టాలనికూడా నేననుకోలేదు. అతనిదారి అతనిది. బట్టలు కుట్టి, విస్తరాకులుకుట్టి వచ్చినడబ్బుతో ఎనిమిదిలో ఆపేసిన నా చదువు ఇంటర్‌దాకా ప్రైవేటుగా సాగించాను. లైబ్రరీలో ఆసక్తి పెరిగి అనేకమైన పుస్తకాలు చదివాను.

"అతను నన్నేరోజూ ఈ విషయాల పట్ల అభ్యంతరం చూపలేదు. పైగా అతను డబ్బుతెచ్చిన రోజునే ఇక్కడ అన్నం తినేవాడు. లేనిరోజున కనబడేవాడుకూడా కాదు. అది నాకు జాలి కలిగించే దనుకోకు. అదే సరియైనపద్ధతి అనుకొనేదాన్ని నేను.

"రావిచెట్టునీ వేపచెట్టునీ కలిపి పెంచుతారు చూసావా. అలాంటిది వివాహం. పెంచినంతలో అవి కలిసిపోవు. దేని శాఖలు దానివి, దేని రుచి దానిది. వేళ్ళు మాత్రం నేలలో దృఢంగా నిలిచి ఉంటాయి. సంప్రదాయంలో వేళ్ళూనిన మా వివాహం నాకు అతన్ని, అతన్ని నాకు తోడు ఉంచింది. అంతే."

ఇలా చెప్పి ఆమె కొద్దిగా విశ్రాంతి తీసుకొని మళ్ళీ చెప్పసాగింది.

"అయితే అంత మంచిమనిషీ నాకు మనస్ఫూర్తిగా ఏడుపు తెప్పించాడోసారి. నా చెయ్యి పట్టుకొని నన్ను తిట్టాడని తన స్నేహితుడొకడితో దొమ్మికి దిగి వ్యసనాల మూలంగా గుండెదెబ్బ తిన్నవాడు కావటం మూలాన మధ్యలో హఠాత్తుగా విరుచుకుపడిపోయి నన్ను ఒంటరిగా వొదిలేసాడు. అప్పుడు మాత్రం నాకు నిజంగా నేఏడుపొచ్చింది"

ఈ మాట అంటున్నపుడామె చెంపలపై జారిన కన్నీరు పలచబడిపోతున్న వెన్నెల్లో అస్పష్టంగానైనా కనపడింది.

"ఛ. ఏడవకు" అన్నాను, ఆమెను ఓదార్చాలనుకొని.

"ఏడవొద్దు అంటున్నావా" నవ్వింది ఆమె. ఒకానొక శీతాకాలపు రాత్రి సముద్రంమీంచి లేచివచ్చి, ఎముకలు కొరికే చలిగాలిలాంటి నవ్వు అది.

నవ్వి, మళ్ళీ చెప్పసాగింది.

"మహానుభావుడు నా తండ్రి దుర్బలుడు. నా ప్రాణం. పిచ్చివాడు నా భర్త. ఓ మామూలు జీవిక సాగించే వాడెవడు దొరికినా నాకు నా జీవితం ఈ దేశంలోని కోట్లాదిమంది గృహిణుల్లాగే సాగిఉండేది.

భర్త చచ్చిపోయాక నేను బొట్టు చెరపలేదు. ఓరోజు పెట్టెలన్నీ సర్దుతుంటే, అతను అరుదుగా వాడే కోటు జేబులో వెయ్యి రూపాయలు, దాంతో పాటు ఉత్తరం కన్పించాయి. తన వ్యసనంవల్ల తన భార్య తన మరణానంతరం దెబ్బతినకూడదని తన కోరికనీ, అందువల్ల నన్ను ఆ డబ్బు స్వీకరించమనీ అతని ఉత్తరం. అది చదివిన వెంటనే నేను చేసిన మొదటిపని నా బొట్టును చెరిపేసుకోవటం."

నా భార్య గుర్తు వచ్చింది నాకు. ఆమె భర్తలాంటిదన్నమాట నా భార్య. ఆమె ధోరణి ఆమెది. సినిమాలూ, నగలూ, పార్టీలు ఆవిడకి అత్యంత ప్రియమైనవి. చదువుకొన్నదే. అయితేనేం 'గీతాంజలి' కన్నా ఆవిడకి జ్యూయెలరీషాప్ కేటలాగు ఎక్కువ నచ్చుతుంది.

"తర్వాత ఏమయింది?" అడిగాను.

"ఏమవటానికేముంది? సగం ఖర్చు పెట్టి నేను చదివిన చదువుకు ఎలిమెంటరీ బడిపంతులమ్మ ఉద్యోగం సంపాదించుకొన్నాను. ఇందులో మా నాన్నగారి అనుభవమూ, ఆదర్శమూ నాకు ఆధారాలు."

"ఇన్నాళ్ళకు స్వతంత్రమయ్యావన్నమాట."

"స్వతంత్రం నా జీవితంలో ఎప్పుడూ ఉంది. నా భర్త కూడా నాకు ఎవరూ యివ్వలేనంత స్వతంత్రం యిచ్చాడు. అయితే తేడా, అప్పటి స్వేచ్ఛ నా భర్త యిచ్చినది యిప్పుడు నాకు నేను యిచ్చుకొన్నది."

"అలా అని కాదు. ఇప్పుడు నీకు ఆర్థికపరమైన స్వేచ్ఛ ఉంది. అందువల్ల నువ్వు నిజంగా స్వతంత్రురాలివి."

"డబ్బు స్వాతంత్ర్యానికి ఆలంబనే కాని స్వాతంత్ర్యం కాదు. నా జీవితం చిన్నప్పుడు మామూలు నేల, అక్కడ నా భర్త చనిపోయి స్మశానం చేసాడు. మళ్ళీ ఈ రోజు డబ్బు అక్కడ తోట వేసింది. కాని నేలమాత్రం స్వతంత్రంగానే ఉంటూ వచ్చింది."

"మరి నిజమైన స్వతంత్రం ఏది?"

"తృప్తి."

నాకు అర్థంకావటంలేదు. అదేమాట చెప్పాను.

ఆమె నవ్వి "నువ్వు అర్థంచేసుకోవటానికి ప్రయత్నించవు, అంతే. సముద్రంలో స్నానం చెయ్యలేకపోయాము కదా అని రోజూ యింటిదగ్గర స్నానం చెయ్యటం మానేసావా? జీవితంలో ఒక దానిని పొందలేకపోవచ్చు, కాని అంతలో జీవితం వ్యర్థమయిందని ఎలా అనుకొంటావ్? అశాంతి అంటున్నావ్, కోల్పోయానంటున్నావ్, సరే, యిక్కడ ఉండిపో అంటే ఉండిపోగలవా నువ్వు?

"ఉండలేవనీ నాకు తెలుసు. కొంత కాలం పోయాక మళ్ళీ తప్పుచేసానను కొంటావు, అక్కడకు వెళ్ళిపోవాలను కొంటావు. అంటే నీకు తృప్తిపడటం రాదు. తృప్తిఅంటే ఎడ్జస్ట్‌కావటంకూడా. మన దృష్టిపై శాల్యాన్ని పెంచుకోవటమే ఎడ్జస్ట్ అవటం. నువ్వు పెరుగుతున్నావంటే నువ్వు స్వతంత్రుడివన్నమాట. స్వతంత్రంగానైనా ఉండు లేదా తృప్తిపడు."

ఆమె చెప్పింది ఆమె జీవితంనుంచి వచ్చిందేనని నాకు నిశ్చయాత్మకంగా తెలుసు. ఆనందంగా ఉండాలంటే స్వతంత్రంగా ఉండాలనే తెలుసు కాని నాకు ఉండటం తెలీదు.

"ఇది నా విషయంలో ఎలా వర్తిస్తుంది?"

"మీ ఆవిడకూడా సినిమాకి వెళ్ళు. పార్టీకి వెళ్ళు. పిల్లలతో అమరావతి వెళ్ళు. తీరికచేసుకొని కవిత్వం వ్రాయి అథవా కథలు చదువు, ఏదీ కుదరకపోతే టెలివిజన్ కొని నెలకోసారైనా కుటుంబంతో ఎంజాయియ్ చెయ్యి. సంవత్సరానికోసారి యిటువైపురా" అని

"ఇవి సున్నితమైన జీవనపద్ధతులు. పద్ధతిమీంచి సిద్ధాంతంమీంచి జీవితాన్ని నడపకూడదు, జీవితంలోంచి సిద్ధాంతాలు వస్తాయి. నువ్వు చెయ్యాల్సిందంతా నిండైన మనస్సుతో జీవితాన్ని అనుభవించు,అదీ నీకున్న పరిధిలో. అదే తృప్తి, అదే స్వాతంత్ర్యం, అదే ఆనందం."

మబ్బు విడిపోయింది. మళ్ళీ వెన్నెల చిక్కనవుతోంది. గాలివీస్తోంది, అరటాకులు హాయిగా కదులుతున్నాయి.

"చాల చక్కని విషయాన్ని చెప్పావు. నా జీవితంలో ఇకనైనా ఆచరిస్తాను."

"అదే తప్పు, అవి నా అనుభవంలోంచి లాగిన స్టేట్ మెంట్లు. నీకు అనుభవమేది? స్వతంత్రంగా అనుభవించి నీ స్టేట్ మెంట్ నువ్వుచెప్పు." అని ఆమె మాల పూర్తిచేసి,

"రా, లోపలకి వెళ్ళిపోదాం," అని చేయి పట్టుకొని లోపలకు తీసుకుపోయింది. ఎటువంటి జీవితం ఈమెది! సముద్రం ఎప్పుడైనా సముద్రమే అనుకొన్నాను.

మంచం, కుర్చీ లోపలకి తెచ్చి,


"మరోమాట, స్వాతంత్ర్యంలో తప్పు అనే ప్రసక్తిలేదు. స్థూలంగా చూస్తే హింస మాత్రమే తప్పు, ప్రేమించడమే మానవత" అన్నది. అని "నువ్వు జీవించేది జీవితం కాదు, ఎలా జీవించాలనుకొంటావో జీవితం అన్నాడొక తాత్త్వికుడు. కాని జీవితం అభిలాషకాదు వాస్తవం, అసంతృప్తి కాదు, పరిధి." అని విర్వచించి ఆ చీకటిలో కొవ్వొత్తి వెలిగించి బల్లపైపెట్టి, తాను మంచం మీద కూర్చొంది.

ఇందాకట్నించి అనాలనుకొంటున్న మాటని అనేసాను. "సముద్రం నువ్వు నన్ను చాలా అపార్థం చేసుకొన్నావని నీ మాటల్నిబట్టి తెలిసింది. నేను నిన్ను ఎంతగా ప్రేమించానో నీకు తెలియదు."

సముద్రం ఒక్క క్షణం నావైపు వింతగా చూసి పకాపకా నవ్వింది. 'అలాగా' అని చెయ్యిపట్టి మంచం మీదకు నన్ను లాగి 'పిచ్చితండ్రి' అని గట్టిగా కౌగిలించుకొన్నది.

ఆ విసురుకు కొవ్వొత్తి ఆరిపోయింది. వెలుగును నింపుకొన్న ఆ చీకటిలో సముద్రం కౌగిలింతలో యిన్నేళ్ళ నా అలసట తీరిపోయింది ఆ పట్టు సడలనీయకుండానే 'సముద్రం' అని చెప్పబోతున్న నన్ను మరీ దగ్గరగా లాక్కొని

"హాయైన పొన్నపువ్వులగాలిలోనికి



వచ్చి పరవశంచేస్తుంటే తలుపులు మూసుకొంటారా ఎవరైనా" అని ముద్దు పెట్టుకొని "నువ్వు యిప్పటికీ నా ప్రేమవీ, ప్రాణానివే" అని ఆ పైన మాట్లాడలేక తన పెదవులతో నా కళ్ళను ముద్దుపెట్టుకొని నా తలని తన వక్షానికి గట్టిగా అదుముకొన్నది.

నా జన్మ ధన్యమై, జ్ఞానోదయమై, సముద్రసంగమంలో అస్తిత్వరహితమై కేవలం భావనామాత్రమైన నేనుగా నిలిచి పునర్జన్మ కవసరమైన రూపు దిద్దుకొన్నది ఆ చీకట్లో.

ఆ రాత్రి నాకో కల వచ్చింది. నేను నెమలి నెక్కి హిమాలయాలమీద విహరిస్తున్నట్టు, అమృత వర్షం కురిసినట్టు. కలనుండి బయటపడి చూస్తే సముద్రం కన్నీరు.

"ఛ. ఏడవకు"

"ఏడవ వొద్దు అంటావా" అని నవ్వింది. ఒకానొక వసంతకాలపు తెల్లవారుజాములో కోకిల గొంతు నుండి బయటపడ్డ భూపాలరాగంలా ఆ చీకటిని చీల్చుకొని వచ్చిన తృప్తి బోధకమైన అభయం ఆ నవ్వు.